సాక్షి అనకాపల్లి

గురువారం । 19 । జూన్ । 2025



కొత్త యాప్‌తో అవినీతికి చెక్

డ్వాక్రా సభ్యులు పొందుతున్న రుణాల్లో జరిగే అవినీతికి కొత్త యాప్‌తో చెక్‌పెట్టవచ్చని సెర్ప్ సీఈవో కరుణ తెలిపారు. 10లో

ఉష్ణోగ్రతలు

బుధవారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	37.0/27.0
చోడవరం	:	36.0/26.0



లాభాల సాగు 10లో

ఆయిల్‌పామ్ సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. చెరుకు, వరి తదితర పంటలకు ప్రత్యామ్నాయంగా సాగుచేస్తున్నారు.

న్యూస్‌రీల్

క్షమాభిక్షపై ముగ్గురు జీవిత ఖైదీల విడుదల



జైల్ నుంచి విడుదలవుతున్న జీవిత ఖైదీలు

ఆరిలోవ(విశాఖ): సుప్రీం కోర్టు ఆదేశాలతో క్షమాభిక్షపై విశాఖ కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు జీవిత ఖైదీలు బుధవారం విడుదల య్యారు. హత్య కేసుల్లో జీవిత ఖైదుపై నాలుగు గోడల మధ్య దశాబ్దానికి పైగా గడిపి, ఎట్టకే లకు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టారు. 2009 ఫిబ్రవరి 2 నుంచి ఇక్కడ శిక్ష అనుభవిస్తున్న విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన ఎ.కృపారావు, 2010 ఆగస్టు నుంచి ఉన్న కృష్ణా జిల్లాకు చెందిన(ప్రస్తుతం విశాఖపట్నం, మధురానగర్) కేవీఎస్‌వీ ప్రసాద్, 2014 అక్టోబరు 28 నుంచి జీవిత ఖైదులో ఉన్న అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన వి.కోటేశ్వరరావులకు సత్ప్రవర్తన కారణంగా క్షమాభిక్ష లభించింది. ఈ సందర్భంగా జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు సూచనలతో రాష్ట్రంలో 17 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష లభించిందన్నారు. అందులో విశాఖ కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ముగ్గురు అర్హులయ్యారన్నారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు, నియమ నిబంధనలు పూర్తిచేసి వారిని విడుదల చేసినట్లు తెలిపారు. ఖైదీలు మీడియాతో మాట్లాడుతూ జైల్‌లో వివిధ కర్మాగార, వ్యవసాయ పనులు చేసినట్లు పేర్కొన్నారు. క్షమాభిక్షపై విడుదల చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జైల్ సూపరింటెండెంట్‌తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు సాయిప్రవీణ్, సీహెచ్ సూర్యకుమార్ విడుదలైన ఖైదీలకు పలు సూచనలు చేశారు.

అనుమతిలేని పాఠశాల మూసివేత

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను అధికారులు మూయించి వేశారు. డీఈవో అనుమతి లేకుండా పాఠశాలను కొత్తగా ఏర్పాటు చేసి, నిర్వహిస్తుండడంతో సమాచారం తెలుసుకుని వెళ్లి పరిశీలించిన మీదట ఎంఈవో సురేష్ కుమార్ నోటీసు ఇచ్చారు. డీఈవో అనుమతి లేనందున మూసి వేయాలని సూచించారు. దీంతో పాఠశాలను మూసి వేశారని ఎంఈవో-2 కె.ఎస్.ఎన్ మూర్తి బుధవారం తెలిపారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



ఏఎల్‌పురంలో మొక్కలు నాటుతున్న సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో లక్ష్మణ్

గొలుగొండ: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, విద్యార్థులు ఇంటి వద్ద తప్పనిసరిగా మొక్కలు నాటాలని సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వో లక్ష్మణ్ తెలిపారు. ఏఎల్‌పురంలో బుధవారం వన సంరక్షణ- మన సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏఎల్‌పురం గ్రామంతో పాటు అల్లూరి పార్కు వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సోషల్ ఫారెస్టు పరిధిలో ఎక్కువ మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని ప్రతి పాఠశాల, ఇంటి పరిసరాల వద్ద, ఖాళీగా ఉన్న స్థలాల్లో నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేంజర్ సుబ్బారావు,సెక్షన్ అధికారి రాజు, మాజీ జెడ్పీటీసీ తారకవేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ఆత్మ హత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

దేవరాపల్లి: పంటలకు గిట్టుబాటు ధర లేక, అప్పుల బాధ తాళలేక మనస్తాపంతో పల్నాడు జిల్లాలో కౌలు రైతులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో ఒకే సారి ముగ్గురు కౌలు రైతులు ఆత్మ హత్య చేసుకోవడం విచారకరమన్నారు. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని పేర్కొన్నారు. అధికారంలోకి రాక ముందు పవన్ కల్యాణ్ కౌలు రైతులను ఉద్ధరిస్తున్నట్టుగా హామీలిచ్చారని, అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కౌలు రైతులు ఆత్మ హత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని కౌలు రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని, చనిపోయిన కౌలు రైతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్‌బీలో వారిదే హవా!

ప్రక్షాళనపై సాక్షాత్తూ డీఐజీ దృష్టి సారించినా ఫలితం శూన్యం

- చక్రం తిప్పుతున్న ఇద్దరు రైటర్లు
- దీర్ఘకాలంగా ఉన్న ఫీల్డ్ అధికారిదే పెత్తనం
- కొత్తగా వచ్చిన వారిని బదిలీ చేయించేందుకు చాడీలు
- అనుకూలమైన వారికి చోటు కల్పించేందుకు యత్నం



సాక్షి, అనకాపల్లి: జిల్లా స్పెషల్ బ్రాంచి విభాగం ప్రక్షాళనపై సాక్షాత్తూ డీఐజీ దృష్టి సారించినా పెద్దగా ఫలితం లేకపోయింది. ఇంకా పాతవారి హవా కొనసాగుతోంది. రెండు నెలల కిందట ఈ విభాగం నుంచి కొంత మందిని బదిలీ చేసినా.. వారు ఇంకా విధుల నుంచి తప్పుకోవడం లేదు. కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా చక్రం తిప్పుతున్నారు. కొత్తగా వచ్చిన వారిని ఇక్కడ నుంచి ఎలాగైనా తిరిగి పంపించేయాలని పన్నాగాలు పన్నుతున్నట్టు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో ఇద్దరు రైటర్లు, ఒక ఫీల్డ్ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్టు భోగట్టా. పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచి విభాగం అతిముఖ్యమైనది. జిల్లాలో ఎక్కడ ఏం జరుగుతోంది?, పోలీసుల పనితీరు ఎలా ఉంది?, ప్రజలు ఏమనుకుంటున్నారు?, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఇతర సంఘాల వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి...తదితర వివరాలను స్పెషల్‌బ్రాంచి ఎప్పటికప్పుడు సేకరించి ఎస్పీకి నివేదిక అందజేస్తుంది. ఇందుకోసం సీఐతో హెడ్‌కానిస్టేబుల్/కానిస్టేబుళ్లు ఉంటారు. అయితే స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్న సిబ్బంది చాలా ఏళ్లుగా అక్కడే ఉండిపోవడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు, కీలకమైన సమాచారాన్ని ఎస్పీకి కంటే ముందుగా ప్రజాప్రతినిధులకు చేరవేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పారదర్శకత పూర్తిగాలోపించింది. ఈ విభాగంలో పేరుకే అధికారులున్నారు తప్ప.. నిర్వహణ, కార్యకలాపాలు ఇద్దరు రైటర్ల కనుసన్నల్లో జరుగుతున్నాయి. ఈ విషయాలన్నీ డీఐజీ దృష్టికి వెళ్లడంతో ప్రక్షాళన చేయాలని ప్రత్యేకంగా ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల బదిలీలు జరిపారు.

బదిలీల ప్రక్రియ అపహాస్యం..

ఇటీవల స్పెషల్ బ్రాంచ్ విభాగంలో కొంత మేర బదిలీలు జరిగాయి. బదిలీల్లో భాగంగా వివిధ విభాగాల్లో పనిచేసిన ఇతర జిల్లాలకు చెందిన వారు ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరి నెలన్నర పూర్తయినా వారికి పూర్తి బాధ్యతలు అప్పగించలేదు. ఈ విభాగంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారికి పదోన్నతి వచ్చే అవకాశం ఉండడంతో... విభాగంలో జరుగుతున్న విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా అక్కడ రైటర్లుగా పనిచేస్తున్న వారే చక్రం తిప్పుతున్నారు. దీంతో బదిలీ అయి వేరే విభాగానికి వెళ్లిన వారే ఇంకా ఫీల్డ్ అధికారులుగా పనిచేస్తున్నారు. కొత్తగా వచ్చిన వారిని పూర్తిగా పక్కన పెట్టారు. వారికి ఎలాంటి అధికారాలు అప్పగించలేదు. వీరిపై ఉన్నతాధికారులకు చాడీలు చెప్పి ఇక్కడి నుంచి వంపే ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలిసింది. తమకు అనుకూలంగా ఉన్న వారిని ఈ విభాగానికి రప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని సమాచారం. ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన కొందరు ఎలాగైనా మళ్లీ అనకాపల్లి రావాలని యత్నిస్తున్నారు.

డీఐజీ ఆదేశాలు బేఖాతరు..

ఎస్‌బీలో సిబ్బందిని పూర్తిగా మార్చాలని డీఐజీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అవి అమలు కాలేదు. కొద్దిపాటి మార్పులు చేసి, ఉన్నతాధికారులకు అసలైన పరిస్థితిని వివరించకుండా తప్పుదారి పట్టిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అనకాపల్లి జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయడంతో పాటు బదిలీపై వచ్చిన అధికారులకు తక్షణమే పోస్టింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. రైటర్ల హవా తగ్గించడంతో పాటు దీర్ఘకాలంగా ఈ విభాగంలో తిష్ట వేసి వ్యవస్థను మేనేజ్ చేస్తున్న వారికి చెక్ పెట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

బల్క్ డ్రగ్‌పార్క్ పనులు వేగవంతం

కలెక్టర్ విజయ్‌కృష్ణన్



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సమీపంలో జరుగుతున్న బల్క్ డ్రగ్ పార్క్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశించారు. బుధవారం ఆమె రాజయ్యపేట,చందనాడ, బోయపాడు ,డీఎల్‌పురం, మూలపర తదితర గ్రామాల పరిధిలో జరుగుతున్న బల్క్ డ్రగ్‌పార్క్ పనులు పరిశీలించారు. మండలంలో రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్‌పార్క్ ఏర్పాటుకాబోతున్న విషయం తెలిసిందే. వివిధ రసాయన కంపెనీల యాజమాన్యాలు ఇక్కడ బల్క్‌డ్రగ్ యూనిట్లు స్థాపించేందుకు ఆసక్తి చూపించాయి. దీంతో ఏపీఐఐసీ ముందుగా డ్రగ్‌పార్క్ కోసం మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. సుమారు రూ.1100 కోట్ల వ్యయంతో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, వాడుకనీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా కల్పించాలి, జాతీయరహదారి నుంచి కనెక్టవిటీ రోడ్లునిర్మించాలి. ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలుకల్పించే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బల్క్ డ్రగ్ పార్క్ నిర్మించే ప్రాంతంలో సుమారు 24 కిలో మీటర్ల మేర అంతర్గత రోడ్లు నిర్మిస్తున్నారు. కల్వర్టులు, బ్రిడ్జిలు, తారు రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, భూగర్భ డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి. వీటిని పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ ఈ గ్రామాల పరిధిలో ఏయే పనులు చేపట్టాలి, ఇంతవరకు ఏయే పనులు ప్రారంభమయ్యాయి. ఎంతవరకు పూర్తయ్యాయి అనే వివరాలను ఏపీఐఐసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే సబ్‌స్టేషన్ పనులు కూడా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలోనే ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు ఏర్పాటు చేసే స్టీల్‌ప్లాంట్‌కు కూడా 2,500 ఎకరాలు భూములు కేటాయించినట్టు చెప్పారు. అక్కడ కూడా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ విస్తరణ కోసం అదనంగా మరో వెయ్యి ఎకరాలు సేకరించాల్సి ఉందని, ఆప్రక్రియ కూడా పూర్తిచేయాలన్నారు. ఏపీఐఐసీ వారి ఆధ్వర్యంలో చేపట్టిన పనులను జోనల్‌మేనేజర్ నర్సింగరావు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీవో వివిరమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తుమ్మపాల: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 21 నుంచి అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన ప్రారంభించనున్నట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో అనకాపల్లి మండలం రేబాక, నర్సీపట్నంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 28 వరకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, గేమ్స్, కాప్, దివ్యాంగ అభ్యర్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25 నుంచి 28వరకు జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20న రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చెల్లించాలన్నారు. సీట్ల కేటాయింపు జులై 7న పూర్తవుతుందన్నారు. ధ్రువీకరణపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి 29 వరకు ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చన్నారు. జులై 1న ఆప్షన్లను తిరిగి మార్చుకోవచ్చన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, 10వ తరగతి మార్కుల లిస్ట్, టీసీ, కుల,ఆదాయ ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలతో పాటు రెండు సెట్ల జెరాక్స్‌లను సమర్పించాలని తెలిపారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ తేదీలు

తేదీ	ప్రారంభ ర్యాంక్	చివరి ర్యాంక్
21	01	15,000
22	15,001	32,000
23	32,001	50,000
24	50,001	68,000
25	68,001	86,000
26	86,001	1,04,000
27	1,04,001	1,20,000
28	1,20,001	చివరి ర్యాంక్

విద్యార్థులకు యోగా కష్టాలు

నిలిచిపోయిన ధ్రువీకరణ పత్రాల జారీ సర్టిఫికెట్ల కోసం పడిగాపులు

మహారాణిపేట(విశాఖ): నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల హడావుడి విద్యార్థులకు సర్టిఫికెట్ల కష్టాలను తెచ్చిపెట్టింది. పాఠశాలలు, కళాశాలలు తిరిగి ప్రారంభమైన ఈ కీలక సమయంలో ప్రవేశాలు, ఇతర విద్యా అవసరాల కోసం తప్పనిసరి అయిన ధ్రువపత్రాలు సకాలంలో అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యోగా దినోత్సవ ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు నిమగ్నం అవ్వడంతో, ప్రజలకు అత్యవసరమైన సేవలు అందించే జీవీఎంసీ, రెవెన్యూ శాఖల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయాల్లో వివిధ ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

విశాఖలో ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను జిల్లా యంత్రాంగం..ముఖ్యంగా రెవెన్యూ అధికారులకు అప్పగించింది. దీంతో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు సహా ఇతర సిబ్బంది కొన్ని రోజులుగా కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదు. ఇదే సమయంలో విద్యాసంస్థలు తెరుచుకోవడంతో అడ్మిషన్ల కోసం ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయాలకు తరలివస్తున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, ములగాడ వంటి నగరంలోని అన్ని ప్రధాన తహసీల్దార్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సిబ్బందిని అడిగితే 'మీ దరఖాస్తు ఆర్.ఐ వద్ద పెండింగ్‌లో ఉంది'లేదా 'ఫైల్ తహసీల్దార్ వద్ద ఉంది'వంటి సమాధానాలు వస్తున్నాయి. అయితే ఆ అధికారులు ఎక్కడున్నారో, ఎప్పుడు వస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. అడ్మిషన్ల గడువు సమీపిస్తున్న తరుణంలో సర్టిఫికెట్లు చేతికి అందకపోవడంతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. యోగా కార్యక్రమం ముఖ్యమే కావచ్చు.. కానీ తమ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సర్టిఫికెట్ల జారీని ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదని విద్యార్థులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తమకు సర్టిఫికెట్లు అందేలా చూడాలని కోరుతున్నారు. ఇక ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వచ్చే కుటుంబ సభ్యులు కూడా ఆర్ఐ లేదా ఆర్ఐ అసిస్టెంట్ అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

భూ తగాదాలో ఒకరికి గాయాలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తల దాడి
- ఎం.అలమండలో ఘటన



గాయపడిన నర్సింహమూర్తి

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యర్రా నర్సింహమూర్తిపై టీడీపీకి చెందిన సింగంపల్లి పోలినాయుడు, లక్ష్మి దంపతులు బుధవారం దాడి చేశారు. భూతగాదా విషయంలో కత్తితో దాడి చేయడంతో నర్సింహమూర్తి తీవ్ర గాయాలుపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నర్సింహమూర్తి తన పొలంలో పనులు చేసుకుంటుండగా టీడీపీకి చెందిన సింగంపల్లి పోలినాయుడు, లక్ష్మి దంపతులు దాడి చేశారు. భార్య లక్ష్మి కళ్లల్లో కారం కొట్టగా, భర్త పోలినాయుడు కత్తితో దాడి చేసినట్టు బాధితుడు చెప్పారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు దేవరాపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం 108 వాహనంలో కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తనపై దాడి చేసిన భార్యాభర్తలపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు వారి నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు నర్సింహమూర్తి తెలిపారు. ఇరువురి మధ్య భూతగాదాలు, కొట్లాట కేసులు కోర్టులో నడుస్తున్నట్లు సమాచారం.

నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధన

డీఈవో అప్పారావు నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావు నాయుడు

కశింకోట: నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధన, పాఠశాలల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదేశించారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, దీనిలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణ, బోధన, మూల్యాంకనం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర కార్యక్రమాల్లో మార్పులు తీసుకు వచ్చినట్టు చెప్పారు. అకడమిక్ క్యాలెండర్, టీచర్ హ్యాండ్ బుక్‌ల నిర్వహణ అన్ని పాఠశాల్లో ఉపాధ్యాయులంతా శత శాతం అమలు చేయాల్సిందేనన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో శత శాతం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈవో అన్నారు. జిల్లాలో అర్హులందరికీ ఇప్పటికే తల్లికి వందనం నగదు జమ అయినట్టు తెలిపారు. పథకం వర్తించని అర్హులు సంబంధిత సచివాలయాల్లో సంప్రదించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెరగడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అవసరం ఉన్న మేరకు పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగాను, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా స్థాయిని పెంచినట్టు చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఎదురైతే సర్దుబాటు చేస్తామని తెలిపారు. మారిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లా ఉప విద్యా శాఖ అధికారి పొన్నాడ అప్పారావు, ఏసీ శ్రీధర్‌రెడ్డి,డీసీసీబీ కార్యదర్శి సత్యనారాయణ, సీసీ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు



తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 18వ తేదీ నుంచి, రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 19వ తేదీ నుంచి ఒక స్లీపర్ క్లాస్, ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను, చర్లపల్లి-బ్రహ్మపూర్(07027/28) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.



కాలువ తవ్వకాలతో బురదమయంగా తయారైన వల్లకొత్తూరు వెళ్లే రోడ్డు

కష్టాలకు వదిలేసి

- అస్తవ్యస్తంగా పోలవరం కాలువ పనులు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

పోలవరం కాలువ పనుల కోసం కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేయడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రామాల్లోకి వాహనాలు రాకపోవడంతో నడిచివెళ్లవలసి వస్తోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

నక్కపల్లి: మండలంలో పోలవరం కాలువ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టరు రోడ్లను ఇష్టానుసారం తవ్వేసి, అసంపూర్తిగా వదిలేయడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. వర్షాలు పడితే ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పోలవరం ఎడమప్రధాన కాలువ 6,7,8 ప్యాకేజీల కింద పనులు పునఃప్రారంభమయ్యాయి.కూటమి ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. జగన్నాథపురం నుంచి దోసలపాడు, చీడిక మీదుగా కొత్తూరు వెళ్లేమార్గంలో పోలవరం కాలువ నిర్మాణం కోసం కాంట్రాక్టర్ రోడ్డును అడ్డంగా తవ్వేశారు. పక్కనుంచి అప్రోచ్ రోడ్డు లేదా రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో చీడిక, కొత్తూరు, సీతానగరం తదితర గ్రామాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాల వారు ఏ అత్యవసరమైనా తుని,పాయయరావుపేట పట్టణాలకు రావాల్సి ఉంటుంది. ద్విచక్రవాహనాలు, ఆటోల్లోనే రాకపోకలు సాగించాలి. పాఠశాలు, కాలేజీలకు విద్యార్థులు కూడా మోటారు సైకిళ్లు, స్కూలు బస్సులు, ఆటోల్లోనే రావాలి. కొద్దిరోజుల క్రితం కాంట్రాక్టర్ కాలువ నిర్మాణం కోసం ఈ గ్రామాలకు వెళ్లే రోడ్డును మధ్యలో తవ్వేయడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణ ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకెళ్లేందుకు వచ్చే బస్సులు కాలువ తవ్వేసిన ప్రాంతం వరకు వచ్చి ఆగిపోతున్నాయి. అవతల గ్రామాలకు రావడానికి బస్సు డ్రైవర్లు నిరాకరిస్తున్నారు. వర్షాలు పడడంతో తవ్విన ప్రాంతమంతా బురదమయంగా మారిందని బస్సులు కూరుకుపోతాయన్న బెంగతో రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ తవ్విన ప్రాంతం వరకు పిల్లలను తీసుకురావాలంటే సుమారు కిలోమీటరు పైనే నడిచి రావాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. చీడిక గ్రామస్తులయితే రెండు కిలోమీటర్ల దూరం నడవాలి. కాలువ వద్ద ఆటోలు కూరుకుపోతున్నాయని, రాత్రిపూట రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామాలకు వెళ్లే మార్గంలో కాంట్రాక్టరు రోడ్డును ఇష్టానుసారం తవ్వేయడమే కాకుండా వెంటనే నిర్మించడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపరిస్థితి ఇలా ఉండటం వల్ల ఆటో డ్రైవర్లు కూడా గ్రామాల్లోకి రావడానికి భయపడుతున్నారని చెప్పారు. అత్యవసర వైద్య సహాయం కోసం ఆస్పత్రికి ఆటోల్లోనే రావాల్సి ఉంటుందని, రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు పడటం వల్ల రోడ్డు అంతా బురదగా మారిందని, కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి ఉండటం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పునఃనిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. బోదిగల్లంనుంచి పెదదొడ్డిగల్లు, వెదుళ్లపాలెంనుంచి సీతం పాలెం వెళ్లే మార్గాల్లో కూడా ఇలాంటి సమస్యలు ఉన్నాయంటూ ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. రోడ్లను ఇష్టానుసారం తవ్వేసి, వెంటనే పూడ్చడం లేదని, రోజుల తరబడి వదిలేయడం వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామంటూ ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేవారు చెబుతున్నారు. కల్వర్టులు నిర్మించి రోడ్లను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చీడిక వెళ్లే దారిలో రోడ్డు మధ్యవరకు తవ్వేసి వదిలేసిన దృశ్యం

లాభాలు బాగు..
ఆయిల్ పామ్ సాగు

- జిల్లాలో 19,500 ఎకరాల్లో పామాయిల్ తోటలు
- చెరకు, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు
- ప్రస్తుతం టన్ను పామాయిల్ ధర రూ.18,650



శంకరంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వద్ద గెలలు దించుతున్న దృశ్యం



కాశీపురంలో ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో పంట

మాడుగుల రూరల్: చెరకు, సరగుడు, వరి, తదితర సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులకు లాభాలు తెచ్చిపెట్టేది ఆయిల్‌పామ్ సాగు. వాణిజ్య పంటగా విరాజిల్లుతున్న ఆయిల్‌పామ్ సాగుతో మెట్ట భూముల్లో జిల్లా రైతులు సిరులు పండిస్తున్నారు. జిల్లాలో పామాయిల్ తోటలు విస్తీర్ణం గత రెండు సంవత్సరాలుగా గణనీయంగా పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 19,500 ఎకరాల్లో సాగవుతుంది. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజన గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. పామాయిల్ మొక్క ఖరీదు రూ.133 కాగా, 90 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నారు. రాయితీ సొమ్ము రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. గతేడాది టన్ను పామాయిల్ ఫ్రూట్ ధర రూ.22 వేలు ఉండగా.. ప్రస్తుతం టన్ను ధర రూ.18,650 ఉంది. గత నెల టన్ను రూ.20 వేలు వరకు ఉండేది. విదేశాల నుంచి ఆయిల్ దిగుమతి వల్ల ఫ్రూట్ ధర తగ్గినట్టు రైతులు చెబుతున్నారు. రావికమతం, చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో 120 ఎకరాల్లో ఈ ఏడాది కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేపట్టారు.

గిరిజన గ్రామాల్లో పెరుగుతున్న విస్తీర్ణం

మాడుగుల మండలంలోని గిరిజన గ్రామాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. తాటిపర్తి, శంకరం, జాలంపల్లి, అవురువాడ, ఎల్.పొన్నవోలు, పొంగలిపాక పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. మాడుగుల మండలంలో 913 హెక్టార్లలో సాగవుతోంది. ఒకప్పుడు బీడు భూములుగా ఉన్న ప్రాంతం అంతా నేడు ఆయిల్‌పామ్ తోటలతో కళకళలాడుతోంది. చెరకు, సరగుడు తోటలు స్థానంలో పామాయిల్ తోటలు వేస్తున్నారు. పామాయిల్ మొక్క వేసిన తర్వాత నాలుగు నుంచి ఐదు సంవత్సరాలకు కాపునకు వస్తాయి.



తాటిపర్తిలో ఆయిల్‌పామ్ ఫ్రూట్‌ను చూపిస్తున్న రైతు

రాయితీతో ఆసక్తి

హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉద్యానవన శాఖ ఎరువుల వినియోగానికి రాయితీ సదుపాయం కల్పిస్తుంది. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం అందిస్తుంది. జిల్లాలో టెనీరా రకం పామాయిల్‌ను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అనకాపల్లి, మాడుగుల, బుచ్చెయ్యపేట, కశింకోట, కె.కోటపాడు, దేవరాపల్లి, రావికమతం, నక్కపల్లి, పాయకరావుపేట, అచ్యుతాపురం, మునగపాక, యలమంచిలి, చీడికాడ, సబ్బవరం, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, కోటవురట్ల, పాయకరావుపేట, నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ, రాంబిల్లి, రోలుగుంట, తదితర మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. పండిన పామాయిల్ ఫ్రూట్‌ను కాటాలు వద్ద తూకం వేసిన అనంతరం బంగారుమెట్టతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని పెద్దాపురం, తదితర చోట్ల గల కంపెనీలకు తరలిస్తున్నారు.



మాగాణి భూముల్లో ఆయిల్ పామ్ మేలు

మాగాణి భూముల్లో ఆయిల్ పామ్ తోటలు వేసుకోవడం ఎంతో శ్రేయస్కరం. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా కోకో, అరటి కూడా సాగు చేసుకోవచ్చు. రెండేళ్ల వ్యవధిలో పామాయిల్ సాగు విస్తీర్ణం మండలంలో పెరిగింది. ఫ్రూట్ ధర తగ్గినా ఈ పంట పండించాలని రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

–వి.భానుపుష్పలీలావతి, మండల ఉద్యానవన శాఖాధికారి, మాడుగుల మండలం



అంతర పంటలతో అధిక ఆదాయం

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా కోకో, అరటి తోటలు వేసుకోవచ్చు. దీని వల్ల అధిక ఆదాయం పొందవచ్చు. కోకో పంట కూడా నాలుగేళ్ల తర్వాత పక్వానికి వస్తుంది. ప్రభుత్వం కల్పిస్తున్న డ్రిప్ ఇరిగేషన్, ఇతర రాయితీలను సద్వినియోగం చేసుకుంటున్నాం.

–బండారు శ్రీరాములు, రైతు, బావన్నపాలెం, మాడుగుల మండలం



రైతులకు 15 రోజులకొకసారి చెల్లింపులు

ఆయిల్‌పామ్ పండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు ప్రతి 15 రోజులకొకసారి చెల్లింపులు జరుపుతున్నాయి. మాడుగుల మండలంలో తాటిపర్తి నుంచి శంకరం మధ్యలో కాటా దగ్గర రైతుల నుంచి ఫ్రూట్ కొనుగోలు చేస్తున్నాం. అనంతరం బంగారమెట్ట వద్ద గల ఆయిల్‌పామ్ కంపెనీకి తరలిస్తాం.

–జి.వి.దుర్గారావు, ఆయిల్ పామ్ ఫీల్డ్ అసిస్టెంట్, మాడుగుల మండలం

జిల్లాలో పెరుగుతున్న సాగు

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం జిల్లాలో గణనీయంగా పెరుగుతుంది. గిరిజన, మైదాన గ్రామాల్లో సాగు చేస్తున్నారు. జిల్లాలో 19,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. హెక్టారుకు రూ.5,250 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు రాయితీ కల్పిస్తున్నాం. ఈ నగదు ఎరువుల వినియోగం కోసం రైతు ఖాతాకు జమ చేస్తాం.

–జి.ప్రభాకర్‌రావు, ఉద్యానవన శాఖాధికారి, అనకాపల్లి జిల్లా

23న నిరుద్యోగ భృతిపై ధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేముల కన్నబాబు, వియ్యపు రాజు

అనకాపల్లి: అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని, లేని పక్షంలో నెలకు రూ.3 వేలు భృతి ఇచ్చే విధంగా చర్యలు చేపడతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ఏడాది పాలనలో నెరవేరలేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల కన్నబాబు, వియ్యపు రాజు విమర్శించారు. బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డు కోడుగంటి గోవిందరావు భవనంలో నిరుద్యోగ భృతిపై పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ భృతిపై ఈ నెల 23న స్థానిక నెహ్రూ చౌక్ వద్ద నిరుద్యోగులతో ధర్నా చేస్తామన్నారు. 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు గత ప్రభుత్వం నిరుద్యోగులను పూర్తిగా మోసం చేసిందని 40 ఏళ్ల రాజకీయం అనుభవం ఉన్న తనను గెలిపిస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తానని, లేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి ఇస్తానని హామీ ఇచ్చి ఏడాది పాలన పూర్తయిందన్నారు. నిరుద్యోగులకు ఏడాదిపాటు బకాయి పడిన నిరుద్యోగ భృతి ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తూతూమంత్రంగా డీఎస్సీ నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో నాలుగు లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే 16 వేల డీఎస్సీ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించకపోగా, ఉన్న 2 లక్షల 60 వేల వలంటీర్లను తొలగించారని ధ్వజమెత్తారు. ఎండీయూ వాహనదారులను, పశుసంచార వాహనదారులను ఏడాది పాలనలో తొలగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చంటి, కాసిం, అఖిల్, శ్రావణి, అలేఖ్య, తులసి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట ఎంపీడీవో మృతి



విజయలక్ష్మి(ఫైల్)

బుచ్చెయ్యపేట: విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఎంపీడీవో వి. విజయలక్ష్మి(61) మృతి చెందారు. ఈ నెల 14న బుచ్చెయ్యపేటలో విధులకు హాజరైన ఆమె అదే రోజు రాత్రి తన ఇంట్లో బాత్‌రూంలో కాలు జారి పడిపోయి తలకు తీవ్ర గాయమైన విషయం విదితమే. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. కోమాలోకి వెళ్లిపోయిన ఆమె చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. మృతి వార్త తెలుసుకున్న జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, తహసీల్దార్ లక్ష్మి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విశాఖ తరలివెళ్లి ఎంపీడీవో మృతదేహం వద్ద నివాళులర్పించారు. బుచ్చెయ్యపేటలో ఆరేళ్లుగా ఆమె ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారు. ఈమె భర్త మల్లికార్జునరావు పార్వతీపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తుండగా, పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో, చిన్న కుమారుడు చైనాలో ఉన్నారు. మరో మూడు నెలల్లో పెద్ద కుమారుడికి వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తుండగా, ఇంతలో ఆమె మరణం తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం ఉదయం ఇసుకతోటలో ఎంపీడీవో పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎంపీడీవో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బుచ్చెయ్యపేట నాయకులు

ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు

అనకాపల్లి టౌన్: కిడ్నీ వ్యాధి రోగులు కేజీహెచ్‌కు వెళ్లనవసరం లేకుండా ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ద్వారా సేవలందిస్తున్నామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ ఆస్పత్రిని ఆయన బుధవారం పరిశీలించారు. ఇక్కడ కిడ్నీవ్యాధి రోగులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిడ్నీ ఫెయిలైన రోగులు ఎక్కువగా వస్తున్నారని, వీటి లక్షణాలు ముందుగా గ్రహించుకొని వైద్యులను సంప్రదించాలన్నారు. నడుము నొప్పి, శరీరంలో వాపు, నీరుడు, గాబరాగా ఉండడం, రక్తహీనత, ఆయాసం, వాంతులు తదితర లక్షణాలు కిడ్నీ ఫెయిల్యూర్‌కు సంకేతాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కృష్ణారావు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు, రామచంద్రరావు, గొర్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ రోగులను పరిశీలిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డీడీ నాయుడు

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

అనకాపల్లి టౌన్: కరెంట్ షాక్ తగిలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ రవి కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సిహెచ్.ఎన్. అగ్రహారం గ్రామంలో యల్లపు వెంకటరామ అప్పారావు ఇంటి నిర్మాణ పనులకు అదే గ్రామానికి చెందిన కోరుకొండ నాగసూర్య (47) దినసరి కార్మికుడిగా బుధవారం విధుల్లోకి వెళ్లాడు. భవనం రెండో అంతస్తు నుంచి నిర్మాణ సామగ్రి దించుతుండగా సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో కిందపడ్డాడు. వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశామన్నారు.

స్వల్ప వివాదమే కాల్పులకు కారణం

నాటుతుపాకీతో అన్నను చంపిన నిందితుడు అరెస్టు



మాట్లాడుతున్న సీఐ పైడపునాయుడు

చీడికాడ: స్వల్ప వివాదమే కాల్పులకు కారణమని తురువోలు ఘటనపై కె.కోటపాడు సీఐ పైడపునాయుడు తెలిపారు. ఈ సంఘటనపై బుధవారం ఆయన చీడికాడ పోలీసు స్టేషన్లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని తురువోలుకు చెందిన మృతుడు జోగా రాము(48), దేముళ్లు అన్నదమ్ములు కాగా, మంగళవారం సాయంత్రం గ్రామంలో ఒడ్డు పండగ చేసుకుని వీరిద్దరూ కళ్లానికి వెళ్లారు. అక్కడ ఆవు వద్ద పాలు తాగేస్తున్న దూడపెయ్యను మద్యం మత్తులో ఉన్న తమ్ముడు దేముళ్లు కర్రతో కొట్టాడు. దానికి మృతుడు రాము వారించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్వల్ప వివాదం తలెత్తగా, పాకలో ఉన్న నాటు తుపాకీని తెచ్చి అన్నపై కాల్చాడు. దాంతో ఛాతి కింద గాయమై మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకుని తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ చూపుతున్న దృశ్యం

లైసెన్సు లేని నాటు తుపాలుంటే అప్పగించాలి: సీఐ

లైసెన్సు లేకుండా ఎవరి వద్దనైనా నాటు తుపాకీలుంటే వారంలోగా పోలీసు స్టేషన్లకు అప్పగించాలని సీఐ పైడపునాయకుడు తెలిపారు. పది రోజుల తర్వాత గ్రామాల్లో చర్ప జరుగుతుందని, అప్పుడు పట్టుబడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాడుగుల ఎస్సై నారాయణరావు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి



మృతుడు వెంకట ప్రసాద్

మునగపాక: మండలంలోని ఒంపోలు పేట గ్రామానికి చెందిన వ్యక్తి గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. వివరాలను ఎస్‌ఐ ప్రసాదరావు విలేకరులకు తెలిపారు. ఒంపోలుపేటకు చెందిన బొడ్డేడ రాజా వెంకట ప్రసాద్ (48) కొంతకాలంగా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నాడు. రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతనిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రసాద్ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మూడు టిప్పర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రావెల్ టిప్పర్లు

కశింకోట: మండలంలోని సింగవరం గ్రామ సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అల్లు స్వామినాయుడు బుధవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి తమ సిబ్బందితో వెళ్లి టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. తగు చర్యలు నిమిత్తం తహసీల్దార్‌కు నివేదించినట్టు చెప్పారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తులు



గిడ్డి అప్పారావు నాయుడు

అనకాపల్లి టౌన్: వివిధ కారణాలతో విద్యకు దూరమైన వారి కోసం ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరడానికి జూలై 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లోగానీ జిల్లాలో ఓపెన్ స్కూల్ సహాయ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో చేరడానికి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలన్నారు. వారికి చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, ఏదైనా పాఠశాలలో ఒకటో తరగతిలో చదివిన టీసీ, జన్మదిన ధ్రువపత్రం ఉండాలన్నారు. ఇంటర్‌లో చేరాలనుకునే వారు పదో తరగతి ఉత్తీర్ణులైన మార్కుల జాబితా, టీసీ, ఆధార్ కార్డు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు వారి కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రేవుపోలవరం తీరంలో యోగాంధ్ర

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర హోంమంత్రి వగలపూడి అనిత అన్నారు. రేవుపోలవరం తీరంలో బుధవారం ఉదయం వెయ్యి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రితో పాటు కలెక్టర్ విజయ్‌కృష్ణన్, కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, నర్సీపట్నం ఆర్డీవో వి.వి.వి. రమణ, తహసీల్దార్ రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే విజయాలు సాధించవచ్చన్నారు.



రేవుపోలవరం తీరంలో యోగాసనాలు వేస్తున్న హోంమంత్రి అనిత, కలెక్టర్ విజయ్‌కృష్ణన్

కొత్త యాప్‌తో అవినీతికి చెక్

బుచ్చెయ్యపేట: డ్వాక్రా సభ్యులు పొందుతున్న రుణాల్లో జరిగే అవినీతికి కొత్త యాప్‌తో చెక్‌పెట్టవచ్చని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ తెలిపారు. బుధవారం నీలకంఠాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. గతంలో డ్వాక్రా సభ్యులు తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణంలో ఎంత చెల్లించారు, ఇంకా ఎంత చెల్లించాల్సి ఉంది తదితర వివరాల గురించి నేరుగా తెలుసుకునే అవకాశం ఉండేది కాదన్నారు. కొత్తగా వచ్చిన 2.0 వెర్షన్ యాప్ ద్వారా ఇకపై సెల్‌ఫోన్ ద్వారా డ్వాక్రా సభ్యులు పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీని వల్ల అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ముందుగా నీలకంఠాపురం,వడ్డాది గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్టు తెలిపారు. జులై 1వ తేదీ నుంచి రాష్ట్రం మొత్తం అమలు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఆర్.శ్రీరాములు నాయుడు,డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఏపీఎం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మునగపాక: మండలంలోని నాగవరం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి గాయాలలైనట్టు ఎస్‌ఐ ప్రసాదరావు విలేకరులకు తెలిపారు. అచ్యుతాపురం మండలం నారపాకకు చెందిన కోన ఆదినారాయణ తన బైక్‌పై పరవాడ వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన లారీ

అస్త్రం యాప్‌పై శిక్షణ

విశాఖ సిటీ : యోగాంధ్ర వేడుకలకు పెద్ద ఎత్తున జనసందోహం వస్తుండడంతో రహదారి రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు 182 మంది పోలీస్ సిబ్బందికి గురువారం అస్త్రం యాప్‌పై శిక్షణ ఇచ్చారు. పోలీస్ శాఖ, జీవీఎంసీ అధికారులతో కలిసి అర్కాడిస్ ఐబీఐ గ్రూప్ ఈ శిక్షణ అందజేసింది. అస్త్రం, జీపీఎస్ డేటా, సీసీ టీవీ ఫీడ్స్, ఏఐ విశ్లేషణల ద్వారా ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ మళ్లింపు, సిగ్నల్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయటానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రజలు ఈ యాప్ ద్వారా ట్రాఫిక్ అప్డేట్స్, పార్కింగ్ సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రయాణాన్ని సమర్థవంతంగా ప్లాన్ చేసుకోవాలన్నారు.

వృద్ధుడు అదృశ్యం



పెద అప్పలకొండ

నాతవరం: మండలంలో వల్సంపేట గ్రామానికి చెందిన విరోదుల పెద అప్పలకొండ(70) అనే వృద్ధుడు ఈనెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని నాతవరం ఎస్‌ఐ సీహెచ్. భీమరాజు బుధవారం తెలిపారు. అప్పలకొండకు మతిస్థిమితం సరిగా లేదని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే 8688397179 అనే ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎంవీపీ కాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తి ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https:// ignoua dmission. samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దర ఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునేందుకు జూలై 15 చివరి తేదీగా పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా సూచించారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20న పలు కంపెనీలకు సంబంధించి 137 ఉద్యోగాల భర్తీ కొరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారులు(టెక్నికల్/క్లరికల్) కె.శాంతి, డి.అరుణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, పేటీఎం, ఓం సర్వీసెస్, హ్యూమన్ పవర్, తలైవార్ స్టీల్, టీం లీజ్(ఎస్‌బీఐ) కంపెనీల్లో ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, లాజిస్టిక్స్, హెల్పర్స్ ఉద్యోగాలకు 18–35 ఏళ్ల మధ్య వయస్కులు హాజరుకావొచ్చన్నారు. జీతం రూ.15 వేల నుంచి రూ.25 వేలు వరకు ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ అర్హతలు కలిగి, ఆసక్తి గల అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్ నందు తమ పేర్లు నమోదుచేసుకుని, శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేష్

అనకాపల్లి టౌన్: విద్యార్థుల **ప్రతిభకు ప్రోత్సా**హం ఇచ్చారు. వారిలో ఉత్సాహం నింపారు. పట్టణంలోని 83వ వార్డు పరిధి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. దాతల సహకారంతో సమకూర్చిన బహుమతులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాజుల రమేష్ అందజేశారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా కుండల లిఖిత్‌కు రూ.7 వేలు, లంకపల్లి యశ్వినికు రూ.5 వేలు, మొత్తం 58 మంది విద్యార్థులకు రూ. 46 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో దాతలు నాగవరపు శేషవల్లి, వెంకటరమణ మూర్తి, యువజన విభాగం నాయకుడు ఉగ్గిన అప్పారావు, వేల్పుల గణేష్, డొంక సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



సీసీడ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ కన్నారావు

అనకాపల్లి టౌన్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని తుమ్మపాల ఎంపీటీసీ పంచదారల కన్నారావు సూచించారు. మండలంలోని కొత్తపేట వీధిలో తొమ్మిది లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో సీసీడ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పన్నీరు వెంకటలక్ష్మి, చంటి, వార్డు మెంబర్లు పట్నాల రాజేశ్వరి, మాదిబోయిన నాగరాజు, తర్రా సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన ఎన్టీఆర్ ఆస్పత్రి శ్లాబ్



ల్యాబ్ రూమ్‌లో పెచ్చులూడిన శ్లాబ్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగుల పరీక్షలు చేసే ల్యాబ్‌ల్లో శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి పడిపోవడంతో ల్యాబ్ టెక్నీషియన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఉన్నత స్థాయి వైద్యాధికారులకు తెలియజేశారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదు. నూతనంగా నియమించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 16 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,750	4,750
రెండో రకం	---	---
మూడో రకం	3,600	3,600

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: అందాల రాక్షసి
పర్తిసాయి	: ఖలేజా
షిర్డీసాయి	: థగ్ లైఫ్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 70 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 18 యూనిట్లు, బీ పాజిటివ్ -26, ఓ పాజిటివ్ -29, ఏబీ పాజిటివ్ -7 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 348 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 317 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ప్రజల వ్యధ పట్టదా?

- అసంపూర్తిగా జల జీవన్ మిషన్ పనులు
- ఎగువ ప్రాంతాలకు సరఫరా కాని నీరు
- నిధులున్నా తీర్మానం ఇవ్వని పంచాయతీ
- చింతలపాలెం గ్రామస్తులకు ఇబ్బందులు



నీరు సరఫరా కాని కుళాయిలు



చింతలపాలెంలో నీరు సరఫరా కాని ఎగువ ప్రాంతంలో కుళాయిలు



నిరుపయోగంగా అదనపు రక్షిత నీటి పథకం ట్యాంక్

కశింకోట: జల జీవన్ మిషన్ కింద మంజూరైన నిధులున్నాయి.. అయినప్పటికీ ఇంటింటికీ కుళాయి పనులు ముందుకు సాగడం లేదు. నెలల తరబడి పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అసంపూర్తి పనులు పూర్తి చేయడంలో ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. దీంతో అరకొరగా నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్నామని చింతలపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని చింతలపాలెం గ్రామం జాతీయ రహదారిని ఆనుకొని రెండు వైపులా విస్తరించి ఉంది. 1500 జనాభా కలిగి ఉంది. ఇక్కడ ఏళ్ల తరబడి తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. బోర్లు వేసినా నీరు లభ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికిగాను పైపులైన్లు వేసి ఇంటింటి కుళాయిలు ఇవ్వడానికి వైఎస్సార్‌సీపీ హయాంలో మూడేళ్ల క్రితం జల జీవన్ మిషన్ కింద రూ.37 లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామంతోపాటు, అనుకొని ఉన్న కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేసి 250 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 50 పైగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. వాటిని ఇవ్వకుండానే కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపి వేశారు. దీంతో సాయిబాబా మందిరం ఎదుట జాతీయ రహదారి అవతల ఉన్న ప్రాంతంలో ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఇవ్వని పరిస్థితి ఉంది.

ఎగువ ప్రాంతాల కుళాయిలకు సరఫరా కాని తాగునీరు

జాతీయ రహదారి రెండో వైపు యలమంచిలి వైపు మార్గంలో ఉన్న ఇళ్లకు ఇంటింటి కుళాయిల కనెక్షన్లు ఇచ్చినప్పటికి జాతీయ రహదారి మదుం కింద నుంచి వేసిన పైపులైన్ దెబ్బతినడంతో అది పునరుద్ధరించక ఆ ప్రాంతానికి తాగునీరు సరఫరా కాని పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం కనెక్షన్లు ఇచ్చిన ఇంటింటి కుళాయిలకు దాదాపు ఏడాది క్రితం ప్రస్తుతం ఉన్న 40 వేల లీటర్ల రక్షిత నీటి పథకం నుంచి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరా చేపట్టారు. అయితే వాటర్ ట్యాంక్ సామర్థ్యం సరిపోకపోవడం, కుళాయిలను కాంట్రాక్టర్, అధికారులు భూస్థాయి మట్టం చూడకుండా ఇష్టం వచ్చినట్లు అస్తవ్యస్తంగా పైపులైన్ వేయడం వల్ల ఎగువ ప్రాంతాల కుళాయిలకు తాగునీరు సరఫరా కావడం లేదు. పల్లపు ప్రాంతంలోని కుళాయిలకు మాత్రం అరకొరగా నీరు సరఫరా అవుతోంది. దీంతో గత్యంతరం లేక అక్కడకు వెళ్లి నిరీక్షించి చాలీ చాలని నీటిని, బోర్ల నుంచి కలుషితం అవుతున్న నీటిని తాగాల్సిన పరిస్థితి ఎదుర్కొనాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని. దీంతో తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.

నిరుపయోగంగా రక్షిత ట్యాంకు

గ్రామంలో సంపతిపురం ఉన్న పథకం నుంచి ఏలేరు కాలువ రక్షిత నీటిని సరఫరా చేయడానికి మరో రక్షిత నీటి ట్యాంకును నిర్మించారు. అది ఐదేళ్లగా నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో మరో అదనపు బోరు ఏర్పాటు చేసి ఆ పథకాన్ని వినియోగంలోకి తెస్తే తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరించ వచ్చునని, ఎగువ ప్రాంత కుళాయిలకు నీరు అందించవచ్చునని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు భావించారు. ఇందుకు ముందుగా అదనపు బోరు ఏర్పాటు చేసి తాత్కాలికంగా తాగునీటి సమస్య పరిష్కరించడం కోసం మండల పరిషత్ నుంచి రూ.లక్షన్నర మంజూరు చేశారు. దానితో మూడు నెలల క్రితం అదనపు బోరును ఏర్పాటు చేశారు. దానికి మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇంకా ఇవ్వాల్సి ఉంది.

సత్వర చర్యలు తీసుకోవాలని అభ్యర్థన

అసంపూర్తి పనులు, ఇంకా మిగిలిన వారికి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి పూర్తి చేసి అప్పగించాలంటే పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. దాంతో అసంపూర్తి పనులు ముందుకు సాగడానికి అవరోధం కలుగుతుందని అధికారులంటున్నారు. ఈ పనులు పూర్తి చేయడానికి జల జీవన్ మిషన్ కింద రూ.10 లక్షల వరకు నిధులు ఉన్నాయని అధికారిక సమాచారం. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేరుకే ఇంటింటి కుళాయిలు



పేరుకే ఇంటింటి కుళాయిలు ఉన్నాయి. నీరు మాత్రం రావడం లేదు. అస్తవ్యస్తంగా పైపులైన్ ఏర్పాటు చేసి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం వల్ల నీరు రావడం లేదు. తాగునీటి కోసం దూరంగా వెళ్లి తెచ్చుకోవలసి వస్తోంది. అదనపు రక్షిత నీటి పథకం నిరుపయోగంగా ఉంది. దాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి అన్ని కుళాయిల నుంచి తాగునీరు సరఫరా కావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సోమిరెడ్డి వాసు, చింతలపాలెం

తాగునీరు సరఫరా కావడం లేదు



ఇంటింటి కుళాయి వేసినా మాకు తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో పల్లపు ప్రాంతంలో కుళా యి వద్ద నీరు పట్టుకోవలసి వస్తోంది. తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలి.

– సియాద్రి భూలక్ష్మి, చింతలపాలెం

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

చింతలపాలెంలో ఇప్పటికే అదనపు బోరు ఏర్పాటు చేశాం. దాని మోటారుకు విద్యుత్ కనెక్షన్ రావల్సి ఉంది. జలజీవన్ మిషన్‌లో మిగిలిన వారికి ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి రూ.10 లక్షల నిధులు ఉన్నాయి. అసంపూర్తి పనులు పూర్తి చేసి రెండో రక్షిత నీటి పథకాన్ని వినియోగంలోకి తీసుకువస్తే తాగునీటి సమస్య పరిష్కారం కాగలదు. పంచాయతీ తీర్మానం ఇచ్చిన వెంటనే 15 రోజుల్లోగా పనులు పూర్తి చేసి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– కె. శ్రీనివాసరావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కశింకోట

కనకదుర్గ ఆలయంలో గోపూజ



శతకంపట్టు కనకదుర్గ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



కనకదుర్గ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హోమం, గోపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి, పాలమరశెట్టి యుగంధర్, జ్యోతి, పొలిమేర అచ్చినాయుడు, జగదీశ్వరి, పాలమరశెట్టి శివప్రసాద్, సాయి లక్ష్మి, కోయిలాడ శివ, మౌనిక దంపతులతో ప్రధాన అర్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ పూజలు చేయించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ గురువారం అమ్మవారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాంబశివుని వార్షిక కల్యాణోత్సవం



శివ, పార్వతుల కల్యాణోత్సవం



కల్యాణ శివపార్వతుల కల్యాణ ఉత్సవ విగ్రహాలు

కశింకోట: స్థానిక కస్పావీధిలో సాంబశివుని వార్షిక కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో కల్యాణాన్ని నిర్వహించారు.శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ విఘ్నేశ్వరుని పూజ, విశ్వక్షేన పూజ, యజ్ఞోపవీతం ధారణ, కన్యాదానం, శుభ ముహూర్తాన జీలకర్ర, బెల్లం పెట్టుట, మాంగళ్యధారణ, తలంబ్రాలు వేయడం, కంకణ ధారణ, కర్పూర దండల అలంకరణ వంటి అంశాలతో సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకుడు వేయిద శంల ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కల్యాణం పురస్కరించుకొని ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై దర్శించారు.

‘108 వాహన సిబ్బందికి జీతాలు చెల్లించాలి’

అనకాపల్లి: చాలీచాలని జీతాలతో అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 వాహన సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. జిల్లాలో 108 వాహన ఉద్యోగులు 114 మంది విధుల నిర్వహిస్తున్నారని, వీరికి మూడు మాసాలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఇప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని 108 వాహన సిబ్బందికి జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఒకరి అరెస్ట్



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి మెడలో పుస్తెల తాడు లాక్కెళ్లిన కేసులో పరవాడ పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తెలిపిన వివరాలు..

గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి దేవి మార్చి 12న బీసీ కాలనీ వీధిలో నడిచి వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 5 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. దేవి ఫిర్యాదు మేరకు పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి బుధవారం కూర్మన్నపాలెం కూడలిలో దొంగతనానికి పాల్పడిన బొండా అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును ఓ గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టినట్లు గుర్తించామన్నారు. పుస్తెలతాడుతోపాటు, చోరీకి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరుణ్‌కుమార్‌పై గతంలో ఆనందపురం, సబ్బవరం, ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మోటారు సైకిల్ దొంగతనం కేసు నమోదయ్యాయి. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో షీట్ ఓపెన్ చేశారని చెప్పారు. మహిళలు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు. సమావేశంలో ఏఎస్ఐ బి.వై.నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సాయిసంతోష్, క్రైం కానిస్టేబుల్ జీఎస్ఎస్‌వీ నాయుడు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీ

- యోగాంధ్ర పేరుతో కనిపించని అధికారులు
- ప్రజలకు అందని ప్రభుత్వ సేవలు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో జనరల్ ఓపీ చాంబర్‌లో ఖాళీగా కుర్చీ, చాంబర్ బయట వేచివున్న రోగులు



అధికారి లేకపోయినా ఫ్యాన్ తిరుగుతున్న తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ చాంబర్



ఖాళీగా దర్శనమిస్తున్న తహసీల్దార్ చాంబర్



మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న ఏసీపీ చాంబర్

అనకపల్లి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కీలక విభాగాల్లోని అధికారులెవరూ అందుబాటులో ఉండడం లేదు. వీరంతా యోగాంధ్ర-2025 పేరుతో ఎక్కడికి వెళ్తున్నారో తెలియడం లేదు. వివిధ పనులపై వస్తున్న ప్రజలకు సంబంధిత అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తహసీల్దార్, జీవీఎంసీ జోన్ కార్యాలయం, ఎన్టీఆర్ ఆస్పత్రి, ఇలా నిత్యం ప్రజలతో సంబంధం ఉండే ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం సంబంధిత అధికారులు ఉండడంలేదు. అత్యవసర విభాగమైన ఎన్టీఆర్ ఆస్పత్రిలో జనరల్ ఓపి చూసే డాక్టర్ ఉదయం 9 గంటలకు వచ్చి రోగులకు సేవలందించాల్సి ఉండగా 10 గంటలయినా రాలేదు. దీంతో అక్కడికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు 10.15 గంటలకు క్యాజువాలిటీ డాక్టర్ వచ్చి రోగులకు వైద్య సేవలందించారు. దీంతో కొంతమంది డాక్టర్ ఆలస్యంపై ఆరా తీయగా, యోగాంధ్ర పనిమీద విశాఖపట్నం వెళ్లారని, అందువల్లే చాంబర్‌లో లేరని, మూడు రోజులుగా ఇదే పరిస్థితి అని తెలిసింది. ప్రభుత్వ స్కూళ్ల ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు వివిధ సర్టిఫికెట్లు కోసం, భూ సంబంధిత పనులపై తహసీల్దారు కార్యాలయానికి తిరుగుతున్నారు. హౌసింగ్ ప్లాన్ కోసం జీవీఎంసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సంబంధిత అధికారి కనిపించడంలేదు. సదరు అధికారి యోగాంధ్ర పనులపై వెళ్లారని సమాచారం. గత కొద్ది రోజుల క్రితం వరకు బదిలీల పేరుతో అధికారులెవరూ అందుబాటులో లేకపోగా, ప్రజలకు అవసరమైన వివిధ పనులను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు మరలా యోగాంధ్ర పేరుతో అధికారులు కార్యాలయాలకు రావడం లేదు. ఈ విధంగా ప్రజలకు అందుబాటులో ఉంచకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారార్భాటం కోసం అధికారులను, సిబ్బందిని ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో విద్యార్థినులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను బుధవారం పంపిణీ చేశారు. 550 మందికి వీటిని అందించారు. హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఎంఈవో సురేష్‌కుమార్, స్కూలు విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, సభ్యులు ఓ అప్పారావు, పి.కల్యాణి, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాఖ యోగాంధ్రకు వెయ్యి మంది విద్యార్థులు

కశింకోట: విశాఖలో ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమానికి మూడు మండలాల నుంచి వెయ్యి మంది విద్యార్థులను తరలించడానికి మండల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కశింకోట హైస్కూళ్ల నుంచి 525 మంది, మాకవరపాలెం నుంచి 340 మంది, రావికమతం నుంచి 126 మంది వంతున విద్యార్థులను ఇక్కడి నుంచి బస్సుల్లో తీసుకెళ్లనున్నారు. వాటికి బస్సు ఒక్కంటికి ఇద్దరు వంతున ఉపాధ్యాయులను ఇన్‌చార్జులుగా నియమించారు. ఇతర మండలాల విద్యార్థులను ఈ నెల 20న కశింకోటకు తీసుకువచ్చి వారికి స్థానిక బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, బాల సదనం, బాలికల ప్రాథమిక పాఠశాలల్లో వసతి కల్పించి బస్సుల్లో ఈ నెల 21న తెల్లవారుజామున 3 గంటలకు విశాఖకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో సురేష్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటలక్ష్మి, ఎంఈవోలు కె.ఎస్.ఎన్. మూర్తి, సురేష్‌కుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన చేస్తున్న వ్యవసాయాధికారులు

అనకాపల్లి టౌన్: ప్రతీ రైతు నారుమడులు సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి రంగాచారి సూచించారు. మండలంలోని వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి గ్రామాల్లో పీఎండీఎస్ విత్తనాలు విత్తడం, ఖరీఫ్ ముందస్తు పనులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లి పెసర, జనుము, జీలుగా వంటి పచ్చిరొట్ట సేంద్రియ విత్తనాలు వేసుకోవాలన్నారు. నాలుగు సెంట్లకు గాను 30 కేజీల వరి విత్తనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

‘మొల్లోడుగెడ్డ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి’

పరవాడ: మండలంలోని భర్నికం మొల్లోడు గెడ్డలో వ్యర్థ రసాయనాలు విడుదల చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీవోడీ లెవల్స్ 270 దాటి తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతూ భూగర్భ జలాల నాశనానికి ఫార్మా పరిశ్రమలు కారణమవుతున్నాయని ఆరోపించారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసి, సముద్ర జలాల్లో విడిచి పెట్టాల్సిన ఉండగా, నిబంధనలను ఉల్లంఘించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు.